క్లుప్తంగా

అతిథి అధ్యాపకుల నియామకం

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి పలు సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఏఎల్ఎన్ శాస్త్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 10న సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో అందజేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50శాతం, ఇతర అభ్యర్థులకు 55శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, ఎస్ఈటీ, ఎస్ఈటీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. బోధన అనుభవానికి సరైన ధ్రువపత్రాలు అందజేస్తే వెయిటేజీ మార్కులు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 12న ఉదయం 10గంటలకు జరిగే ఇంటర్వ్యూకి తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ముదిగొండ తహసీల్దార్‌గా సునీత ఎలిజబెత్


తహసీల్దార్ సునీత ఎలిజబెత్

ముదిగొండ: ముదిగొండ తహసీల్దార్‌గా సునీత ఎలిజబెత్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన ఆమె ప్రమోషన్‌పై ముదిగొండకు వచ్చారు. ఇప్పటిదాక పనిచేసిన తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, బోనకల్‌కి బదిలీపై వెళ్లారు.

నష్టపరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం: భారీ వర్షాలతో నీటమునిగిన పంటపొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్న వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రెవెన్యూ గ్రామాలకు ఒక వ్యవసాయ విస్తరణాధికారి మాత్రమే విధులు నిర్వహిస్తుండటంతో ముంపుకు గురైన పంటలను పరిశీలించడం కష్టంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, నాయకులు సంజీవరావు, నాగులమీరా, వెంకట్రామయ్య, నాగేశ్వరరావు, బసవయ్య, సుబ్బారెడ్డి, శ్యామలరావు, పుల్లారావు, రాజేందర్ తదితరులు ఉన్నారు.

సుధారాణికి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సుధారాణి

సత్తుపల్లి: సామాజిక సేవా కార్యక్రమాలకు గాను సత్తుపల్లికి చెందిన సనాతన ఆయుర్వేద వైద్యురాలు, సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కొనకళ్ల సుధారాణికి విమెన్ ఎక్సలెన్స్ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో ఆదివారం జీసీఎస్ వల్లూరి ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకల్లో ఆమెకు పురస్కారం అందించి సన్మానించారు. ట్రస్ట్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరాజు, మల్కాజ్‌గిరి కోర్టు జడ్జి బూర్గుల మధుసూదన్‌తో పాటు తిరుపతి దొర్రై, గుత్తికొండ కిరణ్, గుర్తికొండ కిరణ్ పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి


బక్కిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చింతకాని: మండలంలోని కోమట్లగూడెంకి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు అవులూరి బక్కిరెడ్డి(68) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, ఏపూరి రవీంద్రబాబు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు, జిల్లా సమితి సభ్యులు శ్రీరాములు, ఏసు, నాయకులు నాగేశ్వరరావు, పుల్లయ్య, మురార్జి, జానికిరాములు, పుల్లా సాహెబ్, రామిరెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.


ఏన్కూరు: వినాయకుడి పూజలో భక్తులు

జై జై గణేషా..

వినాయక నవరాత్రోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. చిన్నారులు, యువకులు, మహిళలు భక్తిశ్రద్ధలతో గణనాధులను పూజిస్తున్నారు. దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేయడంతో పాటు అన్నదానం చేశారు. జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై, గణపతి బొప్పా మోరియా అంటూ భక్తులు చేసిన నినాదాలతో గ్రామాలు మార్మోగాయి.

– సాక్షి నెట్‌వర్క్


మధిర: పూజలు నిర్వహిస్తున్న మల్లాది వాసు, సవిత దంపతులు


వైరారూరల్: కొండకొడిమలో..


కొణిజర్ల: రామాలయం సెంటర్లో గణనాధుడికి పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు


సత్తుపల్లిటౌన్: గణపతి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్


వైరా: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..


చింతకాని: మత్కేపల్లి గ్రామంలో..


కారేపల్లి: బీసీ కాలనీలో..


బోనకల్: ముష్టికుంట్లలో..


కొణిజర్ల: పల్లిపాడులో..


మధిరరూరల్: పూజల్లో పాల్గొన్న ముస్లిం దంపతులు


సత్తుపల్లిరూరల్: బైపాస్‌రోడ్‌లో పూజలందుకుంటున్న గణనాధుడు


ఎర్రుపాలెం రింగ్‌సెంటర్‌లో..


తల్లాడ: నూతనకల్‌లో..


కల్లూరురూరల్: బొమ్మరిల్లులో..

అయ్యవారిగూడెంలో ఉచిత వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ కల్యాణి

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెంలో ఆదివారం బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురి రోగులకు భీమవరం సబ్‌సెంటర్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) కల్యాణి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించి.. పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ దొడ్డా అశోక్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లలో ఆదివారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారలకు అందజేశారు. వివిధ కారణాలతో చికిత్స పొందిన వారికి మంజూరైన రూ.2లక్షల సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను తొమ్మిదిమంది లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో బందం నాగేశ్వరరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, జానీమియా, షాజాహాన్, ప్రమీళ, నబీసాహెబ్, ఆదినారాయణ బాబు పాల్గొన్నారు

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన బోయినపల్లి


పీసీసీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న బోయినపల్లి

వైరా: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను ఆదివారం హైద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బోయినపల్లి కృష్ణామూర్తి గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పని చేసే నాయకులకు, కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఆయన గుర్తు చేశారు.

హర్షం వ్యక్తం చేస్తున్న గౌడ్ సంఘస్తులు..

కారేపల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ గౌడ్ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ సింగరేణి టౌన్ అధ్యక్షుడు, గౌడ సంఘం మండల అధ్యక్షుడు పోలగాని శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కారేపల్లి సర్వాయిపాపన్నగౌడ్ సెంటర్‌లో గౌడ సంఘం జెండా ఎగురవేసి, సర్వాయి పాపన్న చిత్ర పటానికి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో గౌడసంఘం మండల అధ్యక్షుడు పోలగాని శ్రీనివాసరావు, గౌడ కులపెద్ద చంద్రయ్య, సత్యం, వెంకన్న, నాగేశ్వరరావు, శ్రీను, రామారావు, రామారావు, శేషయ్య, రవి, నర్సయ్య, రమేష్, విజయ్, సుబ్బయ్య, నవీన్ పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని గాంధీనగర్‌కాలనీకి చెందిన ఉమేష్, వెంకటేష్ ఇరువురి వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక పత్రి విక్రయ అనంతరం నగదు పంపిణీ విషయంలో వివాదం తలెత్తటంతో ఉమేష్, వెంకటేష్ ఇద్దరు కలిసి మదార్‌సాహెబ్ అను వ్యక్తిపై దాడి చేయటంతో తలకు గాయమైంది. బాధితుడి తల్లి అమీనాబీ చేసిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

గ్రామపంచాయతీల్లో కార్యదర్శుల నిరంతర నిఘా

కల్లూరురూరల్: విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ఎటువంటి ఉపద్రవాలు, ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించకుండా తగిన జాగ్రత్తలు చేపట్టేందుకు గాను గ్రామ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ కార్యాలయంలోనే ఉంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో ఎటువంటి పరిస్థితుల్లో సంభవించిన తక్షణమే పంచాయతీ కార్యదర్శితో పాటు ఇతర సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే ఉంటూ మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఇతర మండల స్థాయి ఉద్యోగులకు పరస్పరం సహకారం ఇస్తూ అందుబాటులో ఉంటున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేసిన యువకులు


పల్లిపాడు కోల్డు స్టోరేజీ సమీపంలో రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న యువకులు

కొణిజర్ల: ప్రతి రోజూ వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ఖమ్మం అశ్వారావుపేట జాతీయ రహదారిపై గుంతలు పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ రోడ్డుపై నిత్యం పలువురు జిల్లాస్థాయి అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు తిరుగుతున్నారు. కానీ ఎవరూ గుంటల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో పల్లిపాడుకు చెందిన కొంత మంది యువకులు తామే ముందుకు వచ్చి గుంటలలో ఇటుకలు, మట్టి, సిమెంట్ వేసి గుంటలు పూడ్చారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని సదరు యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు కలెక్టర్ పర్యటన


వైరా 16వ వార్డులో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వైరా: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వైరా మున్సిపాలిటీలోని 13, 16వ వార్డుల్లో పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. ప్రధానంగా 13వ వార్డులోని రేచర్ల బజార్, వాసవీ కల్యాణమండపం ప్రధాన రహదారులపైకే కాకుండా ఇళ్లలోకి నీరు చేరింది. ఎంపీడీఓ ఆఫీస్ రోడ్డులో అబ్దుల్ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయి ఆయనకు గాయాలు కాగా కాంగ్రెస్ నాయకుడు అన్వర్ రూ.2 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే, 16వ వార్డులో శనివారం రాత్రి అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ చింతల వేణు పర్యటించి డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వర్షపు నీరు చేరిన నేపథ్యాన స్థానికులను ప్రభుత్వ పాఠశాలకు తరలించారు.

ముదిగొండ: భారీ వర్షాల కారణంగా అన్నిశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే ఉండాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. మండలంలోని బాణాపురంలో వరదకు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన ఆయన బాధితులను పునరావాసకేంద్రాలకు తరలించాలని సూచించారు. తహశీల్దార్ సునీత ఎలిజబెత్, డీటీ కరుణాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాగమయి పరిశీలన


పినపాకలో వరద తాకిడికి దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ: మండలంలో ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పర్యటించారు. తల్లాడ, నూతనకల్, పినపాక గ్రామాల్లో పర్యటించారు. తల్లాడలో సీపీఎం కార్యాయలం పక్కనే ఉన్న వాగును ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం నూతనకల్ ఎస్టీ కాలనీలో వరద ముంపునకు గురైన ఇళ్లను పరిశీలించారు. మండలంలోని పినపాక గ్రామంలో వాగును పరిశీలించారు. నాయకులు మట్టా దయానంద్, గుర్రం శ్రీను, రాయల రాము, తుమ్మలపల్లి రమేష్, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్..


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, రాజీవ్‌నగర్‌లు భారీ వర్షాలకు ముంపుకు గురైన నేపథ్యాన ఆదివారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ఆ ప్రాంతాలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులకు అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 2వ వార్డులోని హనుమాన్‌బజార్ శ్మశాన వాటికను పరిశీలించారు. కార్యక్రమంలో పాదిలి హరినాథ్, పల్లపు కొండలు పాల్గొన్నారు.

ప్రజాసేవకు పదవీ విరమణ ఆటంకం కాదు


మాజీ ఎంపీపీ దొడ్డా హైమావతి దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిరూరల్: ప్రజాసేవ చేసేందుకు పదవీ విరమణ ఆటంకం కాదని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బేతుపల్లి బెటాలియన్ ఫంక్షన్‌హాల్‌లో గ్రామస్తులు ఏర్పాటు చేసి మాజీ ఎంపీపీ దొడ్డా హైమావతి పదవీ విరమణ సన్మానోత్సవ కార్యక్రమంలో సండ్ర వెంకటవీరయ్య పాల్గొని మాట్లాడారు. ఐదు సంవత్సరాల పదవీ కాలంలో ఎంపీపీగా ప్రజలకు చేసిన సేవలను కొనియాడుతూ.. ఎంపీపీ దొడ్డా హైమావతి, శంకర్‌రావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, రామారావు, గంగారం సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, రఫీ, పవన్, వేణు, వాసురెడ్డి, జగదీష్, సత్యనారాయణ, రాజేంద్రరావు, బ్రహ్మం, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగరాజు, పవన్, చందు పాల్గొన్నారు.

కారేపల్లి సంతకు వర్షం దెబ్బ

కారేపల్లి: కారేపల్లి సంతకు వర్షం దెబ్బ తగిలింది. ఆదివారం కారేపల్లి సంతకు వివిధ ప్రాంతాల నుంచి మేకలు, గొర్రెలు, ఆవులు, గెదెలతో పాటు, కూరగాయలు, పచారి వస్తువులు అమ్ముకునేందుకు బేరగాళ్లతోపాటు, కొనుగోలు చేసేందుకు ప్రజలు వందలాదిగా తరలివచ్చేవారు. కాగా.. మూడు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వానలకు సంత అంతతమాత్రంగానే జరిగింది.

ఆర్థిక సాయం..

కారేపల్లి: ఇటీవల ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కారేపల్లిలోని భారత్‌నగర్ కాలనీకి చెందిన చలివేంద్రం లక్ష్మీనారాయణ పెంకుటిల్లు శనివారం రాత్రి కుప్పకూలిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు గౌసుద్దీన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ఖలీలుల్లాఖాన్, చెవుల అనీల్‌కుమార్, ఉదయ్, నరేష్, అబ్దుల్లా, కాంతయ్య, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరదబాధితులకు రూ.10వేలు..

ఏన్కూరు: ఖమ్మంలో ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వరదబాధితులను ఆదుకునేందుకు మండలంలో మెడికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల విరాళాలు సేకరించారు. ఈ నగదును జిల్లా ఈసీ సభ్యుడు ఎస్.సత్యనారాయణకు అసోషియేషన్ అధ్యక్షుడు గుర్ల వెంకటేశ్వరరావు శనివారం అందజేసారు.

దివ్యాంగుల ఆశ్రమానికి రూ.5వేలు..


ఆశ్రమానికి నగదు అందజేస్తున్న జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని స్వర్ణిక ఛారిటబుల్ ట్రస్ట్ దివ్యాంగుల సేవా ఆశ్రమానికి సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్, శ్రీవాణి దంపతులు కుమారుడు శేషంత్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం రూ.5వేలు వితరణగా అందించారు. ముందుగా దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోర్టు అడ్మినిస్ట్రేటీవ్ అధికారి బోయినపల్లి రవికుమార్, ఆశ్రమ నిర్వాహకులు వి.రవికుమార్ పాల్గొన్నారు.

ఆగని వాన.. పొంచి ఉన్న ముప్పు

మండలాల్లోని శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలకు వాగులు పొంగగా.. చెరువులు అలుగుపారాయి. పలుగ్రామాల్లో రహదారులపై వరద ఉధృతి వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇప్పటికే వరద చేసిన బీభత్సం మరవక ముందే.. వర్షాలు ఆగకపోవడంతో ప్రజలు భయబ్రాంతులకు గురౌతున్నారు. ఇప్పటికే పలుచోట్ల అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. పలు రహదారులపై రాకపోకలు నిలిపివేశారు. అధికారులు ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలను పరిశీలిస్తూ.. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


కొణిజర్ల: తీగలబంజర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పగిడేరు


వైరారూరల్: వైరా నదిని పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు డివిజన్‌లో భారీ వర్షం

కల్లూరురూరల్: కల్లూరు డివిజన్‌లో మాత్రం కుండపోత వర్షం కురిసింది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం వరకు కల్లూరులో రికార్డు స్థాయిలో 115.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే విధంగా తల్లాడలో జిల్లాలోని అధికంగా 126.2 మిల్లీమీటర్ల వర్షపాత రికార్డ్ అయింది. అదే విధంగా డివిజన్ పరిధి లోని ఏన్కూరులో అతిస్వల్పంగా 20.0 మిల్లీమీ టర్లు, పెనుబల్లిలో 64 మిల్లీమీటర్లు, సత్తుపల్లిలో 32.2 మిల్లీమీటర్లు, వేంసూరులో 87.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అధికంగా వర్షాలకు ఆస్తి, ప్రాణ నష్టం జరక్కుండా ఉండేందుకు గాను ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధంగా ఉంది.


సత్తుపల్లిరూరల్: సదాశివునిపేట-భీమవరం మధ్య రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు


తల్లాడ: ఉధృతంగా ప్రవహిస్తున్న బిల్లుపాడు వాగు


కల్లూరు జెడ్పీ పాఠశాలలో నేలకొరిగిన వృక్షం